ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి


మేయర్ నీలారెడ్డిని కలిసిన ప్రధానోపాధ్యాయులు

నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మేయర్‌ను కలిసి సమస్యలను వివరించారు. పాఠశాలల్లో అదనపు గదులు, మూత్రశాలలు, తాగునీటి వసతులను కల్పించాలని, అదే విధంగా క్రీడా మైదానాలను అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం వీవీ రామకృష్ణ, నిజాంపేట్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రఘునాథ్, ప్రగతి నగర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు.. ఆధ్యాత్మిక నిలయాలు


జగద్గిరిగుట్ట నల్లపోచమ్మ ఆలయ పూజలో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడీ హిల్స్‌లో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేణు యాదవ్, కమలాకర్, బండ మహేందర్, సాయి, మహేష్, నరేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీ పరిధి సారెగూడెంలో నూతనంగా నిర్మించిన ఆదిశైవ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంభీపూర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దవాఖానాల్లో మందుల్లేవ్...!

- వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. పీహెచ్‌సీల్లో మందుల కొరత
- యాంటీబయాటిక్స్ పరిమితమే
- నొప్పులు, రక్తపోటు, షుగర్‌కు సంబంధించిన మందులు కరువే
- పక్క జిల్లాల నుంచి సర్దుబాటు చేస్తున్న వైద్య సిబ్బంది



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత రోగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సాధారణ జ్వరాలు, ఇతర వ్యాధులతో దవాఖానాలకు రోగులు బారులుదీరుతున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా అన్ని ప్రాథమిక గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు జ్వర పీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. విభిన్న వాతావరణ మార్పులతో పలువురు అనారోగ్య సమస్యలకు అవస్థలు పడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు కూడా నమోదు అవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, పెద్దలనే తేడా లేకుండా రోగాల బారిన పడుతున్నారు.

◆ మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (మేడ్చల్, ఘట్కేసర్, శామీర్‌పేట) ఉన్నాయి. అలాగే 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో 11 పీహెచ్‌సీల్లో డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 26 యూపీహెచ్‌సీలు ఉండగా, ఇందులో 6 డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 103 పల్లె, 71 బస్తీ దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 24 గంటలు పని చేసే 13 ఆసుపత్రుల్లో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ప్రతీ రోజు ఓపీలో భాగంగా బయటి రోగుల సంఖ్య సాధారణంగా 80 నుంచి 125 ఉండగా, ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో 200 దాటుతోంది. ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో ఇంకా అధికంగా ఉంటోంది. వీటి పరిధిలో జ్వర బాధితులు ఎక్కువ మంది నమోదవుతున్నారు. కానీ, ఆయాచోట్ల సిబ్బంది కొరతకు తోడు మందుల కొరత నెలకొంది. కనీసం డైక్లోఫినాక్ మాత్రలు అందుబాటులో లేని దయనీయ పరిస్థితి నెలకొంది. యాంటీబయాటిక్స్ నిల్వలు కొంత వరకే ఉన్నాయి. కీళ్ల నొప్పులు, జలుబు, షుగర్, రక్తపోటుతో పాటు.. చర్మ వ్యాధులకు సంబంధించిన మాత్రలు, దురదలకు సంబంధించిన ఆయింట్‌మెంట్స్ కొరత కూడా తీవ్రంగానే ఉంది.

సర్దుబాటు చేస్తున్నాం



జిల్లాలో నిరంతరంగా జ్వరం సర్వే కొనసాగిస్తున్నాం. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో అందుబాటులో ఉన్న మందులకు తోడు రోగులకు అవసరమయ్యే మందులను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి సర్దుబాటు చేస్తున్నాం. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్ఓ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం జీడిమెట్ల ఫేజ్ 3లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫేజ్ 3 11కేవీ హెటరో ఫీడర్ మరమ్మతులు ఉన్నందున మధ్యాహ్నం 3:30 సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఫేజ్ 1లో 33/11కేవీ జీడిమెట్ల ఎస్ఎస్1 మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4:30 జీడిమెట్ల ఫేజ్ 1 భారత్ గ్యాస్ ఐటీఐ ఇండస్ట్రీయల్, థర్మోప్యాడ్స్ పరిశ్రమ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. డీపీ కాలనీకి చెందిన విజయలక్ష్మికి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన



కుత్బుల్లాపూర్: జాతీయ న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా షాపూర్‌నగర్‌లోని శారదా విద్యా భవన్ హైస్కూల్‌లో శనివారం రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ పారాలీగల్ వాలెంటీర్, సామాజిక కార్యకర్త చికిలె మధుబాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన అనేది న్యాయ విజ్ఞానంలో భాగమని, దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భూపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు రాఘవేందర్, లతాశ్రీ తదితరులు పాల్గొన్నారు,

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


వివిధ మతాల పెద్దలతో సమావేశమైన బాచుపల్లి సీఐ ఉపేందర్‌రావు

నిజాంపేట్: ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని భద్రతా చర్యలు చేపట్టాలని బాచుపల్లి సీఐ ఉపేందర్‌రావు అన్నారు. శనివారం వివిధ మతాల పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నగరంలోని కొన్ని ప్రార్థనా మందిరాలపై దుండగుల దాడుల నేపథ్యంలో అలజడులు నెలకొన్నాయన్నారు. ఆయా మందిరాల నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రార్థనా మందిరాలపై పోలీసు సిబ్బంది నిఘా కొనసాగుతుందన్నారు.

15న కార్తీక పౌర్ణమి పూజలు


ఆలయంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ జీడిమెట్ల బస్ డిపో దగ్గర ఉన్న నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం పేర్కొంది. 15న ఉదయం 6 గంటలకు అభిషేకం, అర్చన, 11 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి!


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని మృతురాలి బంధువుల ఆందోళన
- రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన యాజమాన్యం


మాధవి

సుభాష్‌నగర్: సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలు బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ ఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బాచుపల్లికి చెందిన మాధవి (28) ఈ నెల 4న గాల్ బ్లాడర్‌లో స్టోన్ ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యింది. ఈ నెల 6న సర్జరీ చేశారు. రక్త స్రావంతో కోమాలోకి వెళ్లిందని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. దీంతో చనిపోయిన మహిళకు చికిత్స పేరుతో బతికి ఉందని చూపిస్తున్నారని అదే రోజు బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. మాధవికి ట్రీట్‌మెంట్ అందిస్తున్నామని చెప్పడంతో బంధువులు శాంతించారు. తాజాగా శనివారం చనిపోయిందని వెల్లడించడంతో బంధువుల ఆందోళనకు దిగారు. ఆసుపత్రిలోని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో సూరారం పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారంతో పాటు ఇద్దరి పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను భరిస్తామని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో కుటుంబీకులు శాంతించారు. మృతురాలి స్వస్థలం మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామం.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్: ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టడాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజాంపేట కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. బాచుపల్లి గ్రామ సర్వే నెంబరు 454లో ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని శనివారం మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివిధ సర్వే నెంబర్‌లో జరిగిన కట్టడాలపై అధికారులకు వివరించారు. కార్యక్రమంలో శ్యామ్‌కుమార్ రెడ్డి, అమలేశ్వరి, అరుణ్‌రావు, ఈశ్వర్ రెడ్డి, కుమార్ గౌడ్, ముఖేష్, మురళి, యాకూబ్, కృష్ణ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఇంటింటి ప్రచారం



షాపూర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కుత్బుల్లాపూర్: డిసెంబరు 7,8 తేదీల్లో జరిగే సీపీఎం మేడ్చల్ జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని శనివారం షాపూర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ మహాసభల్లో రాష్ట్ర నాయకులతో కలిసి పెద్ద సంఖ్యలో జిల్లా, మండల నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజా సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవదానం, రావుల స్వాతి, దుర్గా నాయక్, యాదవరెడ్డి, ప్రవీణ్, సద్దాం, చాంద్ పాషా, శేఖర్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్టెమ్‌ఫెస్ట్ మెక్లాథాన్ -2024


నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దుండిగల్: భౌరంపేట్‌లోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్టెమ్‌ఫెస్ట్ మెక్లాథాన్ -2024ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రోబోటిక్స్, సస్టైనబుల్ టెక్ సొల్యూషన్స్‌కు సంబంధించిన నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కామన్వెల్త్ స్టూడెంట్ అసోసియేషన్, గ్లోబెల్ అండర్ స్టాండింగ్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సహకారంతో మెక్లాథాన్ పోటీల్లో 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రేసర్‌రోబో, ఫాసెస్ట్ లేన్ ఫాలోవర్, అబ్స్టాకిల్ అవాయిడర్, ఎకోఇన్నోవా సైన్స్ ఎగ్జిబిషన్, బ్రెయినియాక్ బాటిల్ క్విజ్ ల ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెట్టారు.


ఐడీపీఎల్ చౌరస్తాలో నో పార్కింగ్ జోన్‌లో పార్కింగ్‌లు


చింతల్ ప్రధాన రోడ్డులో ఓ కాంప్లెక్స్ ఎదుట..

ఫుట్‌పాత్.. ఆక్రమణలతో హాంఫట్

జంట సర్కిళ్ల పరిధిలో పాదచారులకు సురక్షితమైన నడకదారే కరువైంది. పలు చౌరస్తాలు, ప్రధాన రోడ్ల వెంబడి లక్షలాది రూపాయల ప్రజాధనంలో ఏర్పాటు చేసిన పుత్‌పాత్‌లు ఆక్రమణల చెరలో చిక్కుకున్నాయి. దీంతో పాదచారులు రోడ్లపైనే నడక కొనసాగించాల్సి వస్తోంది. ఐడీపీఎల్ నుంచి సూరారం చౌరస్తా వరకు రూ.60 లక్షల నిధులను వెచ్చించి నడకమార్గాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల దుకాణదారులు, మెకానిక్ షెడ్ల నిర్వాహకులు ఫుట్‌పాత్‌లను తమ సొంత జాగీరుగా వాడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.


షాపూర్‌నగర్ రైతు బజారు ఎదురుగా పుత్‌పాత్‌పై

- పాదచారులకు దారి లేక ఇబ్బందులు
- పలుచోట్ల ఆక్రమించి వ్యాపారాలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

రంగారెడ్డినగర్: జీడిమెట్ల బస్ డిపో నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో చాలా చోట్ల పుత్‌పాట్‌లను ఆక్రమించి మాంసం దుకాణాలు, ఇతర వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. గాజులరామారం, చింతల్ ప్రాంతాల్లో పుట్‌పాత్‌లు వ్యాపార కేంద్రాలుగా మారాయి. ఐడీపీఎల్ చౌరస్తా సమీపంలో, గాజులరామారం నుంచి షాపూర్‌నగర్ రోడ్డులో మెకానిక్ షెడ్ల నిర్వాహకులు పుత్‌పాత్‌లపైనే వాహనాలను ఉంచి పనులు మరమ్మతులు చేస్తున్నారు.

పుత్‌పాత్‌లే పార్కింగ్ అడ్డాలు..

పాదచారుల కోసం ఏర్పాటు చేసిన పుత్‌పాత్‌లు వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారుతున్నాయి. చింతల్ ప్రధాన రహదారి, ఐడీపీఎల్ చౌరస్తా నుంచి బాలానగర్‌కు వెళ్లే మార్గంలో పుత్‌పాత్‌లపైనే ద్విచక్ర వాహనాలు, కార్లు, ప్రైవేట్ బస్సులను నిలుపుతున్నారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు పుత్‌పాత్ ఆక్రమణలపై దృష్టి సారించాల్సి ఉండగా అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదు.

లొకేషన్ పంపించాలంటా!

పుత్‌పాత్‌లపై అక్రమ పార్కింగ్‌ల విషయమై గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళితే.. లొకేషన్ పంపిస్తే పరిశీలిస్తామని చెప్పడం గమనార్హం. పుత్‌పాత్‌లు, ఇతర ఆక్రమణలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉండగా టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితమవుతూ నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


జీడిమెట్ల బస్‌డిపో సమీపంలో పుత్‌పాత్‌పై


మేస్త్రీనగర్ ప్రధాన రోడ్డులో..


ఐడీపీఎల్ చౌరస్తాలో పుత్‌పాత్‌ను ఆక్రమించి..

సర్వే పూర్తి వివరాలను అందజేయాలి


సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న నిజాంపేట్ కమిషనర్ సాబేర్ అలీ


రంగారెడ్డినగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీసీ


జగద్గిరిగుట్టలో జరిగిన సర్వేలో పాల్గొన్న ఉప కమిషనర్ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో శనివారం సమగ్ర కుటుంబ సర్వే కొనసాగింది. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లో జరిగిన సర్వేలో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ, జగద్గిరిగుట్ట డివిజన్‌లో జరిగిన సర్వేలో ఉప కమిషనర్ మల్లారెడ్డి పాల్గొని సిబ్బంది సేకరిస్తున్న వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించి తమ పూర్తి వివరాలను అందజేయాలని ఆయన కోరారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి

నిజాంపేట్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఎన్యుమరేటర్లు చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. నిజాంపేట్ కార్పొరేషన్ వ్యాప్తంగా 152 మంది ఎన్యుమరేటర్లు, 52 మంది సూపర్‌వైజర్లతో సర్వే చేపడుతున్నామని పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని వేగంగా దూసుకువచ్చిన బుల్లెట్ వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ ఏడవ ఫేజ్, ఎల్ఐజీ గృహాల్లో నివాసం ఉండే నరసింహ మూర్తికి (60) తెల్లవారుజామున టీ తాగే అలవాటు ఉంది. దీంతో శనివారం ఉదయం ఫోర్త్ ఫేజ్ వైపు వెళ్లేందుకు ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైటెక్ సిటీ వైపు వెళ్తున్న సురేందర్ బుల్లెట్ వాహనంతో ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు దాటుతున్న నరసింహమూర్తిని ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలని నిరసన



నిజాంపేట్: వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని శనివారం బీజేపీ నాయకులు కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రగతినగర్ ఏనుగుల బొమ్మ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ప్రగతినగర్ అధ్యక్షుడు నరేందర్ చౌదరి మాట్లాడుతూ.. ధ్వంసమైన రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు జంకుతున్నారన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ఆర్.ఎస్.రాజు, రచ్చ చక్రధర్, సంతోష్ గౌడ్, అశోక్, మదన్ గౌడ్, శివకుమార్ గుప్తా, రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, కిషోర్, అనిరుద్ర తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై వెళ్లేది ఎలా?



జీడిమెట్ల: రాంరెడ్డినగర్‌లోని కొన్ని రోడ్లు వర్షం కురిసినప్పుడు, డ్రైనేజీ పొంగి రోడ్లపై పారినపుడు బురదమయంగా మారుతున్నాయి. దీంతో కాలనీ వాసులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్లు వేయించాలని కాలనీ వాసులు ఇప్పటికే మున్సిపల్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్లు వేయించాలని కోరుతున్నారు.